క్లుప్తంగా

కొప్పుల ఈశ్వర్‌కు సన్మానం



గోదావరిఖని: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కొండ పోచమ్మ ఆలయానికి విరాళం



దాతను సన్మానిస్తున్న సభ్యులు

జూలపల్లి: మండల కేంద్రంలోని కొండ పోచమ్మ ఆలయ పునర్‌నిర్మాణానికి సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దారబోయిన నర్సింహాయాదవ్ రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా అభివృద్ధి కమిటీ సభ్యులు దాతను సన్మానించారు. సభ్యులు లోక రవీందర్ రెడ్డి, కొమ్ము పోచాలు, సిరికొండ కొమురయ్య, మెండె రాజయ్య, కామల్ల లచ్చయ్య, దారవేని పోచాలు, బండి స్వామి, చింతమల్ల రాములు, నిట్టు బీరయ్య, చీదురు శ్రీనివాస్ ఉన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుదాం

పెద్దపల్లిరూరల్: మండలంలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ పల్లె ప్రజలకు ఆరోగ్యాన్ని పంచుదామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని రైతువేదికలో గురువారం ఎంపీవో ఫయాజ్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటించేందుకు గుంతలు తవ్వించాలని సూచించారు. ఏపీవో రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గురువారం మహిళల భద్రత, సైబర్ మోసాలపై షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య అవగాహన కల్పించారు. మహిళలు ఏ సమయంలోనైనా అభద్రతా భావంతో ఉన్నట్లు గ్రహిస్తే 63039 23700 నంబర్‌కు కాల్ చేస్తే వారికి భద్రత కల్పిస్తామన్నారు. అలాగే సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం అందించాలని, ఇతరత్రా విషయాలపై డయల్ 100కు సమాచారం అందించాలని వివరించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, హెచ్‌ఎం.ఏకాంబరం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పరిశీలన

ఓదెల: మండలంలోని శానగొండలో పరిసరాల పరిశుభ్రతను సెంట్రల్ టీం గురువారం పరిశీలించింది. ఓదెలలో సెంట్రల్ టీం సభ్యులకు ఎంపీడీవో తిరుపతి స్వాగతం పలికారు. గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డు, జీపీ భవనం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లెదవాఖానా, సోక్‌పీట్, మరుగుదొడ్ల వాడకం గురించి పరిశీలించారు. సెంట్రల్ టీం సభ్యులు కె.జయంత్, రాఘవులు, రేణుక, రామచంద్రారెడ్డి, ఎంపీడీవో జి.తిరుపతి, ఎంపీవో షబ్బీర్ పాషా, కార్యదర్శులు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

ధర్మారం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని అంబేడ్కర్ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురాం డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్ష పోస్టుకార్డుల ఉద్యమంలో భాగంగా ధర్మారం మండల కేంద్రంలో గురువారం అంబేడ్కర్ రథయాత్ర విగ్రహం వద్దకు చేరుకుంది. వచ్చే సంవత్సరం జనవరి 26 వరకు దేశ ప్రధాని నరేంద్రమోదీకి లక్ష మందితో పోస్టుకార్డుల ఉద్యమం జరుగుతుందన్నారు. కరెన్సీ అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లి స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు దేవి రాజలింగయ్య, గందం నారాయణ, సుంచు మల్లేశం, కాంపెల్లి పోచయ్య, దాగేటి కొమురయ్య, సుమన్, పోచయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా సదానందం

పెద్దపల్లిరూరల్: సీపీఐ జిల్లా కార్యదర్శిగా తాండ్ర సదానందం వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. జిల్లాలో కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగిస్తూ పార్టీని బలోపేతం చేస్తున్నందునే తనపై నమ్మకంతో పార్టీ అధినాయకత్వం జిల్లా బాధ్యతలు అప్పగించిందని సదానందం పేర్కొన్నారు.

ధాన్యం కటింగ్ పేరుతో దోచుకున్నారు

• మంత్రి లక్ష్మణ్‌కుమార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: ఆరుకాలం కష్టపడి పండించిన రైతుల ధాన్యానికి తరుగు, కటింగ్ పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను దోచుకుందని రాష్ట్ర మంత్రి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం రాత్రి బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని ఖిలావనపర్తికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు తాళ్లపల్లి రమేశ్, సాగంటి కొండయ్యతో పాటు గ్రామంలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరగా వారందరికీ మంత్రి కండువా కప్పి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ 18నెలల కాంగ్రెస్ ప్రజాపాలనలో అనేక రకాల సంక్షేమ పథకాలు అర్హులకు అందించామని పేర్కొన్నారు. పదేళ్ల అధికారంలో కొనసాగిన బీఆర్‌ఎస్ ఒక్క నిరుపేదకు పక్కా ఇంటిని నిర్మించలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, ఖిలావనపర్తి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ స్వామి, నాయకులు కాడే సూర్యనారాయణ, దేవి జనార్దన్, కాంసాని ఎల్లయ్య, ఆవుల ఎల్లయ్య, పొనవేని స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కన్సల్టెంట్ బృందం పర్యటన



ప్రతిపాదనలు పరిశీలిస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో రాష్ట్ర పురపాలక, పరిపాలనశాఖ ఆదేశాలతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్, ఎన్‌సీపీ కన్సల్టెంట్ బృందం ప్రతినిధులు గురువారం పర్యటించారు. నగరంలో పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామునిగుండాలలో స్కైవే, రింగురోడ్డు, బండ్ డెవలప్మెంట్ తదితర ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి. క్షేత్ర పర్యటనలో భాగంగా ఈ బృందం రామగుండం రైల్వేస్టేషన్, రామునిగుండాలు, నిర్మాణంలో ఉన్న విఠల్‌నగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఎన్‌టీఆర్ నగర్ మార్కెట్, పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ అండ్ షాపింగ్ కాంప్లెక్స్, లక్ష్మీనగర్ ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లను సందర్శించింది. ఈ బృందంలో ఎన్‌సీపీ కన్సల్టెంట్ సభ్యులు ప్రదీప్, చందన, బాబాజీ, వంశీ, ఉమర్ ఉండగా నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శాంతిస్వరూప్, ఎస్‌కే అసోసియేట్స్ ప్రతినిధి కొండల్‌రెడ్డి వారి వెంట ఉండి పనుల ప్రాధాన్యతను వివరించారు.

ఫైనాన్స్ డీజీఎంగా సురేఖ



జీఎంకు రిపోర్ట్ చేస్తున్న సురేఖ

రామగిరి: ఆర్జీ–3 ఏరియా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగాధిపతిగా సురేఖ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జీఎం సుధాకర్‌రావుకు రిపోర్టు అందించి బాధ్యతలు స్వీకరించారు. సురేఖ భూపాల్‌పల్లి ఏరియా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగాధిపతిగా పనిచేసి ఆర్జీ–3 ఏరియాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాన నాలాకు ఇనుప కంచె



ఇనుప కంచె ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

కోల్‌సిటీ: మురుగు నీటి కాలువల్లో చెత్త వేయొద్దని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి సూచించారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక దుర్గానగర్‌లో మురుగునీటి కాలువకు జాలీ ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలించారు. ప్రజలే చెత్తను రోడ్లు, కాలువల్లో వేయకుండా స్వచ్ఛందంగా మున్సిపల్ వాహనాలకు అందించి సహకరించాలని కోరారు. అంతకుముందు ఫైవింక్లయిన్, విఠల్‌నగర్, పరశురాంనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కిరణ్, కుమారస్వామి, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఏవో



ఎమ్మెల్యేకు మొక్క అందిస్తున్న శ్రీనివాస్

గోదావరిఖని: జిల్లా వ్యవసాయాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఏవో బత్తిని శ్రీనివాస్ గురువారం రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందజేసి వ్యవసాయ ప్రగతి నివేదిక ఇచ్చారు. పాలకుర్తి, అంతర్గాం, రామగుండం వ్యవసాయాధికారులు ఉన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు విద్యాలయం ఉపాధ్యాయులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మోడల్ స్కూల్‌కు మరో బస్సును తెలుకుంట, చీమలపేట, నాగులపల్లె, భూపాలపట్నం మీదుగా నడిపితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని వినతిపత్రంలో వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి త్వరలోనే బస్సు నడిపేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు జ్యోతిబసు, బొజ్జ శ్రీనివాస్, విద్యాలయం ప్రిన్సిపాల్ షాదుల్, అధ్యాపకులు ఉన్నారు.

సింగరేణి స్క్రాప్ పట్టివేత

గోదావరిఖని: స్థానిక చౌరస్తా సమీపంలోని హనుమాన్‌నగర్ ఏరియాలో స్క్రాప్ షాప్‌లో గురువారం సింగరేణి స్క్రాప్ పట్టుకున్నారు. సాయిలు అనే వ్యక్తి స్క్రాప్‌షాప్‌లో సింగరేణికి సంబంధించిన ఐరన్ సామగ్రిని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది షాపులో తనిఖీ నిర్వహించి టన్ను స్క్రాప్ స్వాధీనం చేసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. దీని విలువ సుమారు రూ.20వేలు ఉంటుందని వెల్లడించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ అక్బర్‌అలీ, జమేదార్, ఓదెలు ఉన్నారు.

వేతన ప్రోత్సాహక పథకాలపై అవగాహన

గోదావరిఖని: వేతన ప్రోత్సాహకాలపై వకీల్‌పల్లిగనిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ ఉద్యోగుల వేతనాల్లో ప్రోత్సాహకాలు పొందాలంటే సాధించాల్సిన ఉత్పత్తి లక్ష్యాల గురించి వివరించారు. ఉద్యోగుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఏజెంట్ నెహ్రూ, గని మేనేజర్ రవికిరణ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• బాల కార్మికుల గుర్తింపు.. ముగ్గురిపై కేసు నమోదు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కదంబాపూర్ గ్రామశివారులోని కేపీఆర్ ఇండస్ట్రీస్‌లో నిర్మాణ పనులు చేయిస్తున్న ముగ్గురు బాల కార్మికులను గురువారం గుర్తించి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. పోలీసు, లేబర్ ఆఫీసర్లు సంయుక్తంగా తనిఖీ చేయగా 13ఏళ్లలోపు ఇద్దరు బాలికలు, ఒక బాలుడితో నిర్మాణ పనులు చేయిస్తున్నట్లు తెలిసిందని తెలిపారు. పిల్లలను పనిలో పెట్టుకున్న నిర్మాణ కాంట్రాక్టర్ మనోజ్, మేస్త్రీ వెంకటేశ్, యజమాని రాంరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. 18ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకున్నా, పని చేయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

• తహసీల్దార్ ఎదుట నలుగురు బైండోవర్

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి, రామకృష్ణాపూర్, మచ్చుపేటలో గురువారం మంథని అబ్కారీశాఖ ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో కలిసి అనుమానిత ఇంట్లో సోదాలు చేశారు. గతంలో పట్టుబడిన ఇళ్లలో తనిఖీలు చేయగా నాటుసారా విక్రయాలు బయటపడ్డాయి. నాటుసారా విక్రేతలకు రూ.లక్ష జరిమానా విధించారు. వ్యక్తిగత పూచీకత్తుతో ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు.

• పెద్దాపూర్ పెద్ద చెరువును ఎల్లంపల్లి నీటితో నింపాలి

జూలపల్లి: మండలంలోనే అత్యధిక సాగునీటి పారకం ఉన్న పెద్దాపూర్ పెద్ద చెరువును ఎల్లంపల్లి నీటితో నింపి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంకెన్ల లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దాపూర్ పెద్ద చెరువును పరిశీలించిన నాయకులు మాట్లాడారు. ఎస్సారెస్పీ ప్రధాన కాలువ నుంచి రెవెల్లె వద్ద డిస్ట్రిబ్యూటరీ ద్వారా ఎల్లంపల్లి నీటిని కాలువకు లింకు చేసి చెరువులోకి నీటి సరఫరా చేయాలని సూచించారు. మల్లేశ్, మొగిలి ఉన్నారు.

• రామగుండం ఎంఈవోగా మల్లేశం

రామగుండం: రామగుండం మండల విద్యాధికారిగా జింక మల్లేశం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఉన్న గడ్డం చంద్రయ్య ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో పాటు వివిధ ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే స్పందించి గోదావరిఖని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా కొనసాగుతున్న మల్లేశంకు ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు.

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి నరేశ్(34)అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సతయనారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు నరేశ్ కొన్నేళ్లుగా మద్యానికి బానిసై తరచూ తాగుతూ ఏ పని చేయకుండా ఉండేవాడు. మంగళవారం సాయంత్రం మద్యం సేవించిన మైకంలో గడ్డి మందు తాగానని తన భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. చికిత్సకోసం వెంటనే వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు.

• నల్ల బాలుకు అండగా ఉంటాం

గోదావరిఖని: రామగుండం సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన నల్లబాలుకు అన్నివిధాలుగా అండగా నిలుస్తామని, కేసులను లీగల్‌గా ఎదుర్కొంటామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాల హరీశ్‌రెడ్డి అన్నారు. రామగుండం సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నల్ల బాలును గురువారం పరామర్శించి, కేసుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

• సర్వేయర్ల బృందానికి తహసీల్దార్ స్వాగతం

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని భూముల సర్వే శిక్షణ నిమిత్తం వచ్చిన నూతన సర్వేయర్ల బృందానికి గురువారం అంతర్గాం తహసీల్దార్ రవీందర్‌పటేల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సర్వేయర్ల బృందం తహసీల్దార్‌ను సన్మానించారు. అంతర్గాం మండల సర్వేయర్ లలితకుమారి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

• జాతీయ అవార్డుల కోసం ప్రతిపాదనలు పంపండి

సుల్తానాబాద్: గ్రామాల వారీగా జాతీయ అవార్డుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. ఎంపీడీవో సమావేశం మందిరంలో గురువారం మండలంలోని పలు శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. 2023 నుంచి 2025 జూన్ వరకు శాఖల వారిగా ప్రగతి నివేదికతో పాటు అభివృద్ధి కార్యక్రమాల నివేదికను కార్యదర్శులు ఆన్లైన్ చేయాలని సూచించారు. అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.

• ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్య

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుడు అజయ్‌పాల్ సింగ్ (31) గురువారం ఉరేసుకుని మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బరత్‌నగర్ ప్రాంతంలోని లేబర్ క్యాంపులో మధ్యప్రదేశ్‌కు చెందిన అజయ్‌పాల్‌సింగ్ టాటా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడని తోటి కార్మికులు చెప్పారు. కాగా గురువారం రాత్రి క్యాంపులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి కార్మికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎన్టీపీసీ పోలీసులు మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

అధికారులతో సమీక్ష సమావేశం

పాలకుర్తి: పాలకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ)పై వివిధ విభాగాల మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో రామ్మోహనచారి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ ద్వారా ప్రతీ గ్రామ పంచాయతీ అభివృద్ధి స్థాయిని అంచనా వేయనున్నట్లు తెలిపారు. పంచాయతీల అభివృద్ధిలో భాగంగా విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మండల పంచాయతీ అధికారి సుదర్శన్, పుట్నూర్ పీహెచ్‌సీ వైద్యుడు సాయిసూర్య, ఐకేపీ ఏపీఎం సదానందంతో పాటు వివిధ విభాగాల మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులతో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఎం ధన్ ధాన్య యోజనపై హర్షం

ఫెర్టిలైజర్‌సిటీ: దేశవ్యాప్తంగా 1.70 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరే పీఎం ధన్ ధాన్య యోజన స్కీమ్ కు కేంద్రమంత్రి మండలి ఆమోదం తెలపడంపై ఒకేదేశం.. ఒకేఎన్నిక జిల్లా కన్వీనర్ సోమారపు లావణ్య బుధవరం హర్షం వ్యక్తం చేశారు.

ఆర్జీ–1 ఏరియా సీఎస్పీలో సంబరాలు



స్వీట్లు పంచుతున్న బీసీ సంఘం నాయకులు

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ ఇవ్వడంపై ఆర్జీ–1 ఏరియా సీఎస్పీలో బీసీ సంఘం నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిట్ సెక్రటరీ మెరుగు విక్రమ్, సీహెచ్‌పీ హెచ్‌వోడీ పైడిశ్వర్, ఇంజనీర్ హరీశ్, నాయకులు దేవాచారి, దీట్ల చంద్రమౌళి, పెరమాండ్ల శ్రీనివాస్, పెంచాల తిరుపతి, జనగామ శ్రీనివాస్, బీబీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని రోడ్డుపై ఏర్పడిన గుంతతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పాత సెయింట్ మాథ్యూస్ స్కూల్‌కు వెళ్లే దారిలో వాటర్ పైప్‌లైన్ కోసం మట్టి తవ్వి, పైపులైన్ వేశారు. అయితే కాంట్రాక్టరు మట్టిని పూర్తిగా పూడ్చకుండా మధ్యలోనే వదిలేశారు. చిన్న వర్షం కురిసినా నీళ్లు నిలుస్తున్నాయి. ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

రానున్న రోజుల్లో టూరిజం హబ్‌గా రామగుండం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాబోయే రోజుల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆర్జీ వన్ ఏరియాలోని జీడీకే–5 ఓసీపీ ఓబీ కుప్పలపై గురువారం జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. పారిశ్రామిక ప్రాంతాన్ని కాలుష్య రహిత కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఎన్టీపీసీలో రూ.55వేల కోట్లతో విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. మూతపడిన మేడిపల్లి ఓసీపీలో రూ.3వేల కోట్లతో హైడల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం జరగనుందని తెలిపారు. వర్షాకాలంలోగా 4లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. డంప్‌యార్డుపై 110హెక్టార్లలో 1.60లక్షల మొక్కలు నాటేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. నగర అభివృద్ధి కోసం సింగరేణి అనుబంధంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, దీటి బాలరాజు, పాలసాని శ్రీనివాస్, పెద్దెల్లి తేజస్విని, కొలిపాక సుజాత, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాశ్, ఎస్వోటూ జీఎం ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో సివిల్ జీఎం పర్యటన



సన్మానిస్తున్న ఆర్జీ–2 జీఎం వెంకటయ్య

గోదావరిఖని: కార్పొరేట్ సివిల్ జీఎం డి.వెంకటేశ్వర్లు గురువారం ఆర్జీ–2 ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా సివిల్ విభాగం పనులను పర్యవేక్షించారు. జీఎం కార్యాలయంలో జీఎం వెంకటయ్యతో సమావేశమై ఏరియాకు సంబంధించిన పనులు తెలుసుకున్నారు. అనంతరం సివిల్ జీఎంను సన్మానించారు. డీజీఎం సివిల్ ధనుంజయ్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఈఈ ప్రతాపగిరి రాజు తదితరులు ఉన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం



గదులను ప్రారంభిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ పరిధిలోని సెక్టార్–2 సింగరేణి పాఠశాల అదనపు తరగతి గదులను జీఎం లలిత్‌కుమార్ గురువారం ప్రారంభించారు. విద్యార్థుల కోసం సింగరేణి స్కూల్ పక్కన ఉన్న సేవాభవన్‌ను ఆధునీకరించి గదులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు డి.అనిత, పాఠశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ సంతోష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, సేవా జాయింట్ సెక్రటరీ భీనాసింగ్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం



సన్మానిస్తున్న జీఎం నాగేశ్వరరావు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఫైనాన్స్ విభాగంలో సీనియర్ అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఆర్జీ– 2 ఏరియాకు బదిలీపై వెళ్తున్న ఎస్.శిరీషను జీఎం కార్యాలయంలో గురువారం ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు, అధికారులు సన్మానించారు. ఎస్వోటూ జీఎం బండి సత్యనారాయణ, ప్రాజెక్టు ఇంజనీర్ టి.రఘురాం, అధికారులు విక్రమ్, శ్రీహర్ష, భరత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీను సద్వినియోగం చేసుకోవాలి

ఓదెల: ప్రభుత్వ జూనియర్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎడ్యుకేషన్ ప్రత్యేక అధికారి ఉడిత్యాల రమణరావు సూచించారు. ఓదెల ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. ఆన్‌లైన్‌లో కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్, క్లాట్ బోధన తరగతులను ప్రతీ విద్యార్థి ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రతీఒక్కరు కృషిచేయాలని ఆదేశించారు.

సన్మానం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామ కారోబార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్ పంచాయతీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కాగా గురువారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, రాజు, శ్రావణ్‌రావు, రామకృష్ణ, సంపత్ ఆయనను సన్మానించారు.

మహిళల సమస్యపై ఎమ్మెల్యే సతీమణి ఆరా



రైతులతో మాట్లాడుతున్న మనాలిఠాకూర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్పూర్‌లో గురువారం వ్యవసాయ మహిళా కూలీలను రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ కలిసి మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతరత్రా అంశాలపై వారితో ప్రత్యేకంగా చర్చించారు. అదే గ్రామంలో మరోచోటికి వెళ్లేందుకు స్వయంగా ఆమె ట్రాక్టర్ నడపగా మహిళలు ఆసక్తిగా తిలకించారు.